www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

ఆదివారం
25.10.2026





ముంచుకొస్తున్న అర్ణవ్

తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షా లు

పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- బలపడుతున్న తీవ్ర వాయుగుండం
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- భారీ వర్షాల నేపథ్యంలో హెచ్చరికలు
- **లోతట్టు ప్రాంతాల వారికి వాతావరణ శాఖ సూచనలు**

మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది అక్టోబర్ 26 నాటికి 'అర్ణవ్' తుఫానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై తీవ్రంగా ఉండనుండటంతో పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 28 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా వర్షాల ప్రభావం కొనసాగనుంది. భారీ వర్షాల తీవ్రత దృష్ట్యా జయశంకర్ భూపాలపల్లి, హన్మకొండ, మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం, సిద్దిపేట జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. మిగిలిన అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ కాగా, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు.

కలంజ్యోతి, హైదరాబాద్ :

సమల పీఠంపై పమలు

- **మహిళా సర్పంచ్‌లకు బదులుగా భర్తల హాజరు**
- **మహిళా సాధికారతకు గండి కొడుతున్న వైనం**
- **అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్**

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఎన్నికైన మహిళా సర్పంచ్‌లకు బదులుగా వారి భర్తలే హాజరవుతుండటం విమర్శలకు తావిస్తోంది. భార్యల పేరిట అధికారిక సమావేశాల్లో భర్తలే ఆసీనులై పెత్తనం చెలాయిస్తుండటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మండల జనరల్ బాడీ సమావేశాల్లో గ్రామాల సమస్యలపై ప్రజాప్రతినిధులే నేరుగా చర్చించాల్సి ఉండగా, మహిళా సర్పంచ్‌లు గైర్హాజరై వారి స్థానాల్లో భర్తలే హాజరవుతుండటం గమనార్హం.

- కలంజ్యోతి, నాగర్ కర్నూల్

2లో..





ఫ్రిజ్‌కే పరిమితమైన బ్లడ్ శాంపిల్స్

3లో



- టీ-హబ్‌కు తరలించని రక్త నమూనాలు
- రిపోర్టుల కోసం రోగుల ఎదురుచూపులు ■ సిబ్బంది లేక నిలిచిన పరీక్షలు
- అధికారుల పర్యవేక్షణ లోపంపై విమర్శలు
- రోగులకు రిపోర్టులు అందేలా పర్యవేక్షణ : సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ

నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాలను పరీక్షల కోసం టీ-హబ్‌కు తరలించకుండా ల్యాబ్ ఫ్రిజ్‌లోనే ఉంచడం చర్చనీయాంశంగా మారింది. శనివారం ఉదయం నుంచి సేకరించిన శాంపిల్స్‌ను ఉయ్యాలవాడలోని టీ-హబ్‌కు తీసుకెళ్లేందుకు అవసరమైన సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఒక్క నమూనా కూడా అక్కడికి చేరలేదు. ఫలితంగా సకాలంలో పరీక్షల రిపోర్టులు అందక రోగ నిర్ధారణ, తదుపరి చికిత్సలో తీవ్ర జాప్యం జరుగుతోందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - కలంజ్యోతి, నాగర్ కర్నూల్

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
ఆదివారం 25.10.2026
www.kalamjyothi.com



ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

- కాంట్రాక్టు వ్యవస్థ రద్దు హామీని నిలబెట్టుకోవాలి



కలంజ్యోతి, వరంగల్ (అక్టోబర్ 25) : నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెకు బీఆర్‌టీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన ధర్నా శిబిరంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా కార్యదర్శి గోలి సంధ్య కూర్చొని సంఘీభావం తెలిపారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 12 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 17 విభాగాల్లో పనిచేస్తున్న దాదాపు 17 వేల మంది కాంట్రాక్టు సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండివైఖరి ప్రదర్శిస్తూ స్పందించకపోవడం దారుణమని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు వ్యవస్థ రద్దు హామీని నిలబెట్టుకోండి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కాంట్రాక్టు వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి, పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి వర్గాలకు దాదాపు 90 శాతం వైద్యం ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది ద్వారానే అందుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడం ప్రజా వైద్యం పట్ల ప్రభుత్వానికున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కాంట్రాక్టు కార్మికుల న్యాయపోరాటానికి తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా నాయకులు తంగేళ్ల సుజాత, పిట్టల శ్రీలత, సృజన, మాధవి తదితరులు పాల్గొన్నారు.

టస్కా సభ్యురాలిగా లక్ష్మీయాదవ్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 24) : ఎల్లారెడ్డిపేట మండల టస్కా (తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్) సభ్యురాలిగా మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యురాలు ఒగ్గు లక్ష్మి యాదవ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య లేఖ నంబర్ 55 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. టస్కా సభ్యురాలిగా వయోవృద్ధుల సంరక్షణ బాధ్యతలు చేపడుతూ, తల్లిదండ్రులను పోషించని కుమారులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. వృద్ధులు తమ కుమారుల పోషణపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే టస్కా సభ్యుల సమక్షంలో ఒగ్గు లక్ష్మి యాదవ్‌తో పాటు మరో ముగ్గురు సభ్యులు కౌన్సిలింగ్ ప్రక్రియను చేపడతారు. ఈ సందర్భంగా లక్ష్మి యాదవ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనపాల శంకరయ్య, రాష్ట్ర కార్యదర్శి చెన్నమాధవుని రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం నారాయణ, కోశాధికారి దొంత దేవదాసుకు కృతజ్ఞతలు తెలిపారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురి అరెస్ట్



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 24) : నిర్మల్ జిల్లా భైంసా సబ్ డివిజన్ లో దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు దొంగల ముఠాను భైంసా రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలను భైంసా ఎ ఎస్పీ సాయికిరణ్ వెల్లడించారు. ముధోల్ మండలం ఎడ్బిడ్ గ్రామానికి చెందిన పెద్ద సాయన్న, భూమేష్, గంగన్నల తో పాటు నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కొంతం గ్రామానికి చెందిన పందరి, కుమార్ లు బృందంగా ఏర్పడి పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వివరాలను సేకరించి ఈ ఐదుగురిని అరెస్ట్ చేశారు. వీరి వద్దనుంచి 170 తులాల వెండి నగలు, 13 గ్రాముల బంగారు నగలు, రూ.22 వేల నగదు, 2 ద్విచక్ర వాహనాలతో పాటు 3 మొబైల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సి ఐ ప్రవీణ్, ఎస్సై సుప్రియ లు దర్యాప్తు కొనసాగించారు.



ఎమ్మెల్యే కవ్వంపల్లికి సర్పంచ్ కృతజ్ఞతలు

కలంజ్యోతి, ఇల్లంతకుంట : వెల్జిపురం గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు చేయడంతో పాటు అభివృద్ధి పనులకు నిరంతరం సహకారం అందిస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు వెల్జిపురం సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సర్వసభ్య సమావేశంలో గ్రామ రైతులు, ప్రజల తరపున ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ ఘనంగా సత్కరించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ రైతుల చిరకాల కోరిక అయిన సబ్‌స్టేషన్ మంజూరుతో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదని పేర్కొంటూ, రైతులు, ప్రజల అవసరాలను గుర్తించి గ్రామాభివృద్ధికి తోడ్పడుతున్న ఎమ్మెల్యేకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మెల పీఠంపై పమ్ములు

కలంజ్యోతి, నాగర్ కర్నూల్ (అక్టోబర్ 25) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల జనరల్ బాడీ సమావేశంలో ప్రజల చేత ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులకు బదులుగా వారి భర్తలు హాజరవుతుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. భార్య సర్పంచ్‌గా కొనసాగుతుంటే అధికారిక సమావేశాలకు మాత్రం భర్తలే హాజరవుతూ కుర్చీల్లో ఆసీనులవుతున్నారు. మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో గ్రామ సమస్యలపై ప్రజాప్రతినిధులే నేరుగా చర్చించాల్సి ఉండగా, మహిళా సర్పంచ్‌లు గైర్హాజరై వారి స్థానాల్లో భర్తలు పెత్తనం చెలాయిస్తుండటం విడ్డూరంగా మారింది.

మహిళా సాధికారతకు గండి కొడుతున్న వైనం..

స్థానిక సంస్థల్లో మహిళలను పాలనలో భాగస్వాములను చేయాలనే సదుద్దేశంతో ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల అసలు లక్ష్యం ఇలాంటి చర్యల వల్ల పూర్తిగా నీరుగారుతోంది. మహిళా సాధికారతను పెంపొందించేందుకు చట్టసభలు రిజర్వేషన్లు కేటాయిస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం భర్తల ఆధిపత్యం రాజ్యమేలుతోంది. మహిళా ప్రజాప్రతినిధుల అధికారాలను పక్కనబెట్టి బహిరంగంగా మండల సమావేశాల్లోనే భర్తలు హల్చల్ చేస్తుండటం మహిళా సాధికారతకు తూట్లు పొడవడమేనని స్థానికులు మండిపడుతున్నారు.



అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్..

కార్యక్రమంలో ఎన్నికైన సర్పంచ్‌లు మాత్రమే సమావేశాలకు హాజరుకావాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే సమావేశ మందిరంలో భర్తల జోక్యం యథేచ్ఛగా కొనసాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మహిళా ప్రజాప్రతినిధుల హక్కులు, అధికారాలను గౌరవించేలా చర్యలు చేపట్టాలని, ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి అసలైన మహిళా సర్పంచ్‌లనే అధికారిక సమావేశాలకు రప్పించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి పరామర్శ

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 24) : ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూడిది రాజేందర్ ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్ రెడ్డి, తిమ్మాపూర్ ఉపసర్పంచ్ జజ్జరి దేవేందర్, నాయకులు నమలికొండ సత్తయ్య, గంట వెంకటేష్ గౌడ్, ఎల్లా గౌడ్, గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, కొండ ఆంజనేయులు గౌడ్, అందే బాలయ్య, భాస్కర్, దేవయ్య, చంద్రం ఆయన్ను కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ, త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
ఆదివారం 25.10.2026
www.kalamjyothi.com

ఫ్రిజ్‌కే పరిమితమైన బ్లడ్ శాంపిల్స్



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 24) : నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాలు పరీక్షల కోసం టీహబ్‌కు తరలించకుండా ఫ్రిజ్‌లోనే ఉంచడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. శనివారం ఉదయం నుంచి రోగుల నుంచి సేకరించిన నమూనాలను ఉయ్యాలవాడలోని టీహబ్‌కు తీసుకెళ్లేందుకు అవసరమైన వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో ఒక్క శాంపిల్ కూడా అక్కడికి చేరలేదు.

రిపోర్టుల కోసం రోగుల ఎదురుచూపులు..

ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లలో అధిక ఖర్చులు భరించలేక నిరుపేద రోగులు ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. అలాంటి వారి నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపకుండా ఆస్పత్రి ల్యాబ్ ఫ్రిజ్‌లోనే నిల్వ ఉంచడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం నుంచి పరీక్షల ఫలితాల కోసం రోగులు నిరీక్షిస్తున్నారు. సకాలంలో రిపోర్టులు చేతికి రాకపోతే వైద్యులు రోగ నిర్ధారణ చేసి తగిన చికిత్స అందించడంలో తీవ్ర జాప్యం జరిగే ప్రమాదం ఏర్పడింది.

సిబ్బంది లేక నిలిచిన పరీక్షలు..

ప్రభుత్వ ఆస్పత్రి నుంచి టీహబ్‌కు ప్రతిరోజూ రక్త నమూనాలను పంపించే వ్యవస్థపై స్పష్టమైన బాధ్యత కొరవడింది. నమూనాలను తరలించే వ్యక్తి విధుల్లో లేనప్పుడు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదనే ప్రశ్నలు వస్తున్నాయి. ల్యాబ్ టెక్నీషియన్లు ఈ విషయాన్ని ముందస్తుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారా లేదా అన్నది తెలియరాలేదు. ఒక్క వ్యక్తి గైర్హాజరైతే మొత్తం వైద్య పరీక్షల ప్రక్రియే ఆగిపోయే దుస్థితి నెలకొనడం ప్రభుత్వ సేవల తీరును తేటతెల్లం చేస్తోంది.

అధికారుల పర్యవేక్షణ లోపంపై విమర్శలు..

ప్రజల ఆరోగ్యానికి కీలకమైన రక్త పరీక్షల విషయంలో ఇంతటి నిర్లక్ష్యం చోటుచేసుకోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నమూనాలు సరైన సమయానికి ల్యాబ్‌కు చేరకపోతే పరీక్షల ఫలితాలు మారిపోయే ప్రమాదముంది. ఈ నిర్లక్ష్యానికి కారణమైన వారిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఆస్పత్రి ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి. నిలిచిపోయిన నమూనాలను వెంటనే టీహబ్‌కు పంపి రోగులకు త్వరితగతిన రిపోర్టులు అందేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎక్కడ?

రక్త నమూనాలను తరలించే సిబ్బంది అందుబాటులో లేనప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలకు సంబంధించిన సేవలు సజావుగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఇలాంటి జాప్యాలు పునరావృతం కాకుండా నమూనాల తరలింపునకు తగిన సిబ్బందిని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

రోగులకు రిపోర్టులు అందేలా పర్యవేక్షణ : ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ..

నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం నుంచి రక్త నమూనాలను టీహబ్‌కు తరలించకపోవడం వాస్తవమేనని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ తెలిపారు. ప్రస్తుతం నిలిచిపోయిన శాంపిల్స్ అన్నింటినీ టీహబ్‌కు పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమస్యపై స్వయంగా పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని, రోగులకు త్వరితగతిన పరీక్షల రిపోర్టులు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



ఎమ్మెల్సీ పోచంపల్లితో పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డి భేటీ

- పోచంపల్లికి శుభాకాంక్షలు
- ఓటరు నమోదుపై చర్చ
- ఎన్నికల ప్రణాళికపై దృష్టి

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 24) : వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైనందుకు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓటరు నమోదుపై చర్చ..

త్వరలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నిర్వహణలో భాగంగా నర్సంపేట నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన ఓటరు నమోదు ప్రక్రియపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించేందుకు అనుసరించాల్సిన విధానాలపై మాట్లాడారు.

ఎన్నికల ప్రణాళికపై దృష్టి..

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణను వేగవంతం చేయాలని, ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటరు నమోదును పకడ్బందీగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియను విజయవంతం చేసేలా రూపొందించాల్సిన ప్రణాళికపై వారి మధ్య చర్చ జరిగింది.



రేపటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేం దుకు ఐకేపీ అధికారులు ముమ్మరంగా సన్నద్ధమవుతున్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియను సజావు గా నిర్వహించడంతో పాటు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నా రు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా శనివారం ఐకేపీ మహిళా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి ధాన్యం కొను గోలు విధానం, కేంద్రాల నిర్వహణ, రైతులకు అందించాల్సిన సేవలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేస్తూ రైతులకు పారదర్శక సేవలు అందించాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీపీఎం మాణిక్ రెడ్డి, ఏపీఎం వెంకటలక్ష్మి హాజరై దిశానిర్దేశం చేయగా, సీసీఎస్‌లు మంగ్యానాయక్, దేవేందర్, వెంకటరమణ, సుదర్శన్, సుధాకర్‌తో పాటు వీవోఏలు, కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని నిర్ణయించారు.



మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా జమాల్

ఎమ్మెల్యే కవ్వంపల్లి, నాయకులకు కృతజ్ఞతలు


కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 24) : ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహమ్మద్ జమాల్‌ను మరోసారి నియమించారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో ఈ నియామకం జరగగా, మండల కేంద్రంలో జమాల్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా ఇల్లంతకుంట టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహమ్మద్ ఫహీంను నియమిస్తూ సంబంధిత నాయకులు ఆయనకు నియామక పత్రం అందజేశారు.

పార్టీ బలోపేతానికి నిరంతర కృషి..

ఈ సందర్భంగా మహమ్మద్ జమాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని పేర్కొన్నారు. తన పనితీరును గుర్తించి నమ్మకంతో మరోసారి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి, నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కవ్వంపల్లికి కృతజ్ఞతలు..

తన నియామకానికి పూర్తిస్థాయిలో సహకరించిన పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర మైనార్టీ చైర్మన్ ఇర్ఫాన్ అలీ, పక్కా బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, రాజన్న సిరిసిల్ల జిల్లా మైనార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మానకొండూర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల వెంకటికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 25.10.2026
4
www.kalamjyothi.com



గోల్డెన్ అవర్‌లో వేగంగా స్పందించాలి

- పీఎం రాహత్‌తో ప్రమాద బాధితులకు ఊరట
- బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యం
- అధికారులు సమన్వయంతో ప్రాణనష్టం తగ్గించాలి
- సీఎస్ సంజయ్ జాజు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 24) : పీఎం రాహత్ (ప్రైమ్ మినిస్టర్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలైజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్‌మెంట్) పథకంతో రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ పథకం అమలు తీరుపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఈ సమీక్షకు హాజరయ్యారు. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అనుసంధానం, నిధుల విడుదల ప్రక్రియపై సమగ్రంగా చర్చించారు.

గోల్డెన్ అవర్‌లో వేగంగా స్పందించాలి..

ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రిలో చేర్పించే బాధితులకు, పోలీస్ ఆమోదిత కేసుల్లో గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు పూర్తి చికిత్స అందించే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధితుల ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఆ సమయంలో యంత్రాంగం వేగంగా స్పందించాలని సూచించారు.

కలెక్టర్లు రోడ్డు భద్రతా కమిటీలు, జిల్లా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. బాధితుల వివరాలను టీఎంఎస్ 2.0 పోర్టల్‌లో నమోదు చేయాలని, అత్యవసర సేవల కోసం 112, సీసీటీఎన్ఎస్ వ్యవస్థలతో అనుసంధానించాలని ఆదేశించారు. జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా చికిత్స ఖర్చులను నేరుగా ఆసుపత్రులకు చెల్లించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

అధికారులు సమన్వయంతో ప్రాణనష్టం తగ్గించాలి..

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి నిండు ప్రాణాలు కాపాడాలని స్పష్టం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే సంబంధిత శాఖలు అప్రమత్తమై చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డాక్టర్ సంతోష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టాస్క్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

- ఈ నెల 27 నుంచి తరగతులు ప్రారంభం
- నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోండి
- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 24) : సిరిసిల్ల టాస్క్ (తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) రీజనల్ సెంటర్‌లో టెక్నికల్ కోర్సులు, బ్యాంకింగ్ బీఎఫ్ఎస్ఐ విభాగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో కొనసాగుతున్న టాస్క్ రీజనల్ సెంటర్‌లో ఈ నెల 27 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. టాస్క్‌లో శిక్షణ పొందిన వారికి ప్రముఖ కంపెనీల్లో మంచి ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంటూ, నిరుద్యోగ యువత ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 95734 20718, 70755 22671 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

కేసు పూర్వాపరాలపై విచారణ

దాడికి పాల్పడిన వారిపై చర్యలు : డీఎస్పీ నాగేంద్రచారి



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 24) : ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి శనివారం గ్రామానికి చేరుకుని క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఈ నెల 20వ తేదీ రాత్రి తెర్లుమద్ది గ్రామంలోని బొడ్రాయి వద్ద డీజే నడుస్తుండగా, దానిని ఆపాలని కోరినందుకు గ్రామానికి చెందిన కొమ్మట మధు ఇంటి వద్దకు ఆరుగురు వ్యక్తులు వచ్చి ఆయనతో పాటు ఆయన భార్య, సోదరుడిపై దాడి చేసి కొట్టినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఈ నెల 23న ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై జ్యోతి కేసు నమోదు చేశారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు..

డీఎస్పీ నాగేంద్ర చారి గ్రామంలో బాధితులను కలిసి మాట్లాడి ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితుల ఆరోపణలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దాడి జరిగిన తీరు, ఇతర వివరాలను సేకరించి కేసు పూర్వాపరాలపై సమగ్రంగా ఆరా తీశారు. చట్టప్రకారం కేసు దర్యాప్తు వేగవంతం చేసి నిందితులపై తదుపరి చట్టపరమైన చర్యలు చేపడతామని పోలీసులు స్పష్టం చేశారు.



ఎస్సై శ్రీధర్‌రెడ్డికి ఘన సన్మానం

కలంజ్యోతి, హత్నూర (అక్టోబర్ 25) : హత్నూర మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హత్నూర మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి రాజేందర్ మాట్లాడుతూ ఈ నెల 22న నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకలు విజయవంతం కావడానికి పోలీస్ శాఖ అందించిన సహకారానికి కృతజ్ఞతగా ఈ సన్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హత్నూర మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి రాజేందర్, కాసాల సర్పంచ్ కొటాల వెంకటేశం, లింగాపూర్ సర్పంచ్ మణిదీప్, పల్వనూరు సర్పంచ్ ఆంజనేయులు, ముదిరాజ్ సంఘం నాయకులు దుర్గయ్య, రవి, తలారి యాదగిరి, పన్యాల రాజు, హత్నూర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సదర్మాట్‌కు నీటిని వదిలి పంటలు కాపాడండి



కలెక్టర్‌కు రైతుల వినతి

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 24) : పరిపంట పొట్టకు వచ్చిన దశలో సదర్మాట్ కాలువకు నీటిని వదిలి రైతులను ఆదుకోవాలని కడెం మండల రైతాంగం కలెక్టర్ భవేష్ మిశ్రా కు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ భవేష్ మిశ్రా కడెం మండలానికి పర్యటనకు వచ్చిన నేపథ్యంలో రైతాంగం ఆయనను కలిసింది. ఒకపక్క ఎల్ నినో ప్రభావం వల్ల వారబంది పద్ధతిలో పంటలకు నీరు వదులుతున్న కారణంగా పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలిపారు.పంట చేతికి అందేందుకు మరో నెల పట్టవచ్చని వారన్నారు. ఈ నేపథ్యంలో వందలాది ఎకరాల్లో సాగవుతున్న వరి పంట పూర్తిగా దెబ్బతిని రైతులు కోరుకోలేని పరిస్థితి ఎదురవుతుందని వారు పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేష్ మిశ్రా హామీ ఇచ్చారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది పంటలను పరిశీలించి నివేదికను కలెక్టర్ కు అందజేసేందుకు క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు.



12వ రోజుకు చేరిన దీక్షలు

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 24) : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు చేస్తున్న దీక్షలు శనివారం 12వ రోజుకు చేరాయి. గత ఇరవై సంవత్సరాలుగా అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మిగిలిన వారితో సమానంగా పని చేస్తున్న తమకు వారితో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు. 12 రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నా తమను పట్టించుకోవటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

ఆదివారం 25.10.2026

www.kalamjyothi.com



విబి-జి రామ్ జీతో భరోసా

- జాబ్‌కార్డుదారులు పనులు పొందాలి
- 125 రోజుల పనిదినాలను సద్వినియోగం చేసుకోండి
- అధికారులు ప్రజల వద్దకే వెళ్లి అవగాహన కల్పించండి
- నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 24) : కేంద్ర ప్రభుత్వ వివిజి రామ్ జీ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు పొంది, ఆర్థికంగా స్వావలంబన సాధించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. పంటల దిగుబడి తగ్గడం, వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గే పరిస్థితుల్లో ఈ పథకం గ్రామీణ పేదలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలం కొండుకూరులో నిర్వహించిన జోన్-1 స్థాయి వివిజి రామ్ జీ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్ర సంగించారు.

125 రోజుల పనిదినాలను సద్వినియోగం చేసుకోండి..

ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై ప్ర తికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 125 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకం కింద చేపట్టే పనులకు కూలీ డబ్బులు సకాలంలో చెల్లించేలా పకడ్బందీ చర్యలు తీసు కుంటామని చెప్పారు. గ్రామాల్లో నీటి సంరక్షణ, జలవనరుల అభివృద్ధి వంటి పనులను చేపట్టడం ద్వారా కూలీలకు ఉపాధితో పాటు గ్రామీణ ప్రాం తాల్లో శాశ్వత ప్రయోజనాలు చేకూరుతాయని వివరించారు.

ప్రజల వద్దకే వెళ్లి అవగాహన కల్పించండి..

అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో పాల్గొనేలా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే అధికారులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి ఉపాధి పనులపై చైతన్యవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆ ర్‌డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు సందీప్, తుకారాం, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్‌నినో ముప్పును ఎదుర్కోవాలి

- విపత్తు నివారణ ప్రణాళికను అమలు చేయండి
- సీనియర్ రాజకీయవేత్త కొండూరు గాంధీరావు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 24) : తెలంగాణలో ఎల్‌నినో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు విపత్తు నివారణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలని సీనియర్ రాజకీయవేత్త కొండూరు గాంధీరావు కోరారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పరి బదులు పప్పుధాన్యాలు, చిరుధాన్యాల వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తూ, రాయితీపై విత్తనాలు, వాతావరణ సమాచారం రైతులకు అందించాలన్నారు. వర్షాభావ మండలాలను గుర్తించి కరువు సాయం, పంటల బీమా పరిహారం వేగంగా చెల్లించాలన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ వనరులు సిద్ధం చేయడంతో పాటు పశుగ్రాసం నిల్వలు, నిరంతర విద్యుత్ సరఫరాకు అత్యవసర చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



రబీ పంటలపై రైతులకు అవగాహన

- ఆరుతడి పంటలనే సాగు చేయండి
- వ్యవసాయ అధికారి రాజశేఖర్

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 24) : ఎల్లారెడ్డిపేట మండలంలో రాబోయే రబీ సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నిగ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ తెలిపారు. మండలంలో మొదటిసారిగా రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో పంటలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రైతులు అధిక సంఖ్యలో గ్రామసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నపథ్యంలో రైతులు రబీలో మొక్కజొన్న, పెసర, రాగులు, సజ్జలు వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో విడతలవారీగా సభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లేందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి, ఏఈఓలు అనూష, ముకుంద్, బొప్పాపూర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.



మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి



- కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- హాజరు రిజిస్టర్లు, కిచెన్ పరిశీలన
- ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 24) : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం వంటగది, ఫ్రీజర్, నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే పాఠశాలలోని కంప్లైంట్స్ బాక్స్‌ను తెరిపించి విద్యార్థినుల నుంచి ఎలాంటి సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయో వివరాలు ఆరా తీశారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి..

పాఠశాల ఆవరణ అంతా నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థినులకు నిర్ణీత మెనూ నిబంధనల ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని స్పష్టం చేశారు. కంప్లైంట్స్ బాక్స్‌లో వచ్చే ప్రతి ఫిర్యాదుపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని, అసలు సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బందీ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

పారిశుద్ధ్య మెరుగుదలే లక్ష్యం

ముచ్చర్ల సర్పంచ్ యాదగిరి

కలంజ్యోతి, హన్మకొండ (అక్టోబర్ 25) : హన్మకొండ మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ యాదగిరి ఆదివారం ప్రారంభించారు. ముచ్చర్ల గ్రామ శివారులోని వేక పరిశ్రమ అందించిన సీఎస్ఆర్ నిధులు రూ.5 లక్షల సహాయంతో చేపడుతున్న ఈ డ్రైనేజీ పనులకు ఆయన శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఆర్థిక సహకారం అందిస్తున్న పరిశ్రమ యాజమాన్యానికి, పరిశ్రమ ప్రతినిధులకు గ్రామ పాలకవర్గం, గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమకు పాలకవర్గ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

'మౌజా హీ మౌజా' ప్రయాణం ప్రత్యేకం

బాలీవుడ్ చిత్రం 'మౌజా హీ మౌజా' షూటింగ్ పూర్తయినట్లు నటి రాశీ ఖన్నా సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ షూటింగ్ తనకు పనిలా కాకుండా విహారయాత్రలా సాగిందని పేర్కొంటూ సెట్స్‌లోని సరదా జ్ఞాపకాలను పంచుకున్నారు. కెమెరా ఆఫ్ అయిన ప్రతిసారీ ఆటలు, నవ్వులతో సెట్ మొత్తం ఎంతో సందడిగా ఉండేదని, తెర వెనుక క్షణాల్లోనే అసలైన మజా ఉంటుందని రాశీ తెలిపారు. ఈ ప్రయాణాన్ని ప్రత్యేకంగా మార్చినందుకు సహ నటులు అక్షయ్ కుమార్, విద్యా బాలన్, దర్శకుడు అనీస్ బజ్మీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. దిల్ రాజు నిర్మాణంలో, అనీస్ బజ్మీ-అక్షయ్ కుమార్ కలయికలో 15 ఏళ్ల తర్వాత తెరకెక్కుతున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.



Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.